# ఉత్సవాల ఏర్పాట్లలో వేగం పెంచాలి..

## జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాచలం, మార్చి 24, ప్రజా జ్యోతి:** భద్రాచలం లో ఈ నెల 27న నిర్వహించనున్న శ్రీరామనవమి, 28న మహా పట్టాభిషేకం ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఉత్సవాలకు సమయం తక్కువగా

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



# భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 25 | మార్చి | 2026 ◆ పేజీలు : 9




2 లో..

# రామయ్య ఆతిథ్యానికి...

# "గ్యాస్" కష్టాలు

- సీతారాముల కళ్యాణానికి లక్షలాది మంది భక్తుల రాక
- భోజన వసతి ఏర్పాటు చేసేందుకు హోటల్ యజమానుల ఇక్కట్లు
- సమస్యను గుర్తించి పరిష్కరించాలి
- ప్రభుత్వానికి, కలెక్టర్ కు విన్నవించు కుంటున్న హోటల్ యజమానులు భక్తులు

ఇరాన్-అమెరికా యుద్ధ ప్రభావం దక్షిణ అయోధ్యగా పేరుం దిన భద్రాచలంలో ప్రత్యక్షంగా రామయ్య ఇస్తున్న ఆతిథ్యంతో పాటు లక్షలాది మంది పరోక్షంగా ఆధారపడుతున్న హోటల్ రంగంపై పడుతున్నట్లే కనిపిస్తుంది. కమర్షియల్ గ్యాస్ కొరత ఆతిధ్యరంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. చాలా హోటళ్లు ఇప్పటికే ఆహార పదార్థాల మెనూను కుదించగా మరికొన్ని ఏకంగా మూతపడే స్థితికి చేరుకున్నాయి.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి



# తగ్గేదేలే.. బడా వ్యాపారాలు కొనసాగింపుడే!

2 లో..

● చిరు వ్యాపారులపై కోరడా! ● బడా వ్యాపారుల వైపు కన్నెత్తి చూడని వైనం! ● ప్రజాజ్యోతి దినపత్రిక కథనంతో చిరు వ్యాపారులకే నోటీసులు! ● కొత్త బస్టాండ్ వద్ద చిరు వ్యాపారులపై ప్రతాపమా ● డ్రైనేజీలపై షాపులు తొలగించాలని ఆదేశాలు! ● కొన్ని షాపుల సామాగ్రి తరలించి మరల ఇచ్చేసిన సిబ్బంది ● ఆమ్ బజార్ లో డ్రైనేజీలపై వ్యాపారాలు కనిపించడం లేదా? ● రోడ్లను ఆక్రమిస్తున్న కంటి తుడుపు చర్యలేనా! ● ఆమ్ బజార్ పై ప్రధానంగా దృష్టి పెట్టరా! ● మెయిన్ రోడ్డుపై చిరు వ్యాపారులపై వివక్షత ఎందుకో! ● అందరికి ఒకే నిబంధనలు ఉండవా ● అధికారులు ఎలా స్పందించేనో.!

ఇల్లందు మున్సిపాలిటీ అధికారుల నోటీసులు, ప్రభుత్వ నిబంధనలను భేఖాతర్ చేస్తూ ఆమ్ బజార్ లో డ్రైనేజీలు, మెయిన్ రోడ్డులో ఫుట్ పాత్ లను ఆక్రమించుకొని దర్జాగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ అధికారులు సదరు వ్యాపారులందరికి నోటీసులు జారీ చేసినప్పటికీ వాటిని పెడుతున్న పెడుతూ తగ్గేదేలే అంటూ షాపులను అక్కడే ఉంచి వ్యాపారాలు కొనసాగించడం వారి వ్యవహార శైలికి నిదర్శనమనే చెప్పొచ్చు. ఇల్లందు మున్సిపాలిటీలో మాత్రం ఒక విచిత్ర నిబంధనలు అమలవుతున్నాయని తెలుస్తుంది. ప్రజాజ్యోతి దినపత్రికలో ఆక్రమిస్తాం.. అడ్డుకునేదేవరు.. అనే కథనం ప్రచురితం కావడం జరిగింది. ఈ కథనానికి స్పందించిన అధికారులు అటు అమ్ బజార్, ఇటు మెయిన్ రోడ్డుపై వ్యాపారాలను సమానంగా చూడడం లేదనే ఆపవాదు ఉంది.

● ఇల్లందు, ప్రజాజ్యోతి

## శ్రీరామనవమి వేడుకలకు

# కట్టుదిట్టమైన బందోబస్తు

- భక్తులకు సౌకర్యాల కోసం క్యూఆర్ కోడ్, ఆన్‌లైన్ మార్గదర్శక సేవలు
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 24, ప్రజా జ్యోతి** భద్రాచలంలో ఈ నెల 27, 28 తేదీలలో జరగనున్న శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసు శాఖ తరపున పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ, భక్తులు సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పార్కింగ్ స్థలాలు, కళ్యాణ మండపం, వివిధ సెక్టార్లు, లడ్డూ మరియు

మిగతా 2 లో...



# మా ఆసుపత్రే...

# మాకు నమ్మకం

- ప్రభుత్వ వైద్య సేవలకు వైద్యులే బ్రాండ్ అంబాసిడర్లు
- ప్రైవేట్ వైపు కాకుండా ప్రభుత్వ ఆసుపత్రులకే మొగ్గు
- భద్రాద్రిలో ఆరోగ్య సేవల నాణ్యతకు నిలువెత్తు నిదర్శనం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 24, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసం గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందే తాము సేవలందిస్తున్న అదే ఆసుపత్రుల్లో చికిత్స పొందడం

మిగతా 2 లో...

## శ్రీరామనవమి వేడుకలకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు

(మొదటి పేజీ తరువాయి... )

తలంబ్రాల కౌంటర్లకు చేరుకునే మార్గదర్శకంగా క్యూఆర్ కోడ్ మరియు ఆన్‌లైన్ లింక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ ఆన్‌లైన్ సదుపాయం ద్వారా భక్తులు వేడుకల రోజుల్లో భద్రాచలంలో తమకు కావాల్సిన ప్రదేశాలకు సులభంగా చేరుకోవచ్చని వివరించారు. అదేవిధంగా సుమారు 2000 మంది పోలీసు సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కావున భక్తులందరూ పోలీసు శాఖ సూచనలు పాటిస్తూ సహకరించాలని, అలాగే ఆ రెండు రోజులపాటు ట్రాఫిక్ నియంత్రణ కోసం విధించే ఆంక్షలకు భద్రాచలం పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## మా ఆసుపత్రే మాకు నమ్మకం



(మొదటి పేజీ తరువాయి... )

విశేషంగా నిలుస్తోంది. ఇది అక్కడి వైద్య సేవల నాణ్యతకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు ఆరోగ్య కార్డులు, రీయింబర్స్‌మెంట్ వంటి సదుపాయాలతో కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించడం సర్వసాధారణం. అయితే భద్రాద్రి జిల్లాలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. ఇక్కడ నర్సింగ్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, కార్యాలయ సిబ్బంది నుంచి వైద్యుల వరకు అందరూ తమ ఆసుపత్రులపైనే నమ్మకం ఉంచి అక్కడే చికిత్స పొందుతున్నారు. ఇటీవల పలువురు మహిళా సిబ్బంది తమ విధులు నిర్వహిస్తున్న ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకుని ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ ఆఫీసర్ మమత సిజేరియన్ ద్వారా మగ శిశువుకు జన్మనిచ్చారు. అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్ గణేష్ తన భార్యకు సుఖప్రసవం నిర్వహించారు. ఇల్లందు ఆసుపత్రిలో ఫార్మసిస్ట్ రజని సిజేరియన్ ద్వారా ఆడ శిశువుకు జన్మనిచ్చారు. భద్రాచలం ఆసుపత్రిలో డాక్టర్ ఆశా పర్వీన్‌కు సుఖప్రసవం జరిగింది.అదేవిధంగా భద్రాచలం నర్సింగ్ సూపరింటెండెంట్ యశోద కుమార్తెకు పుట్టిన శిశువు అత్యవసర పరిస్థితిలో ఉండగా, అక్కడి పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స అందించి ప్రాణాలు కాపాడటం వైద్యుల నైపుణ్యాన్ని చాటింది. గత ఏడాది కాలంలో భద్రాచలం, మణుగూరు ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ప్రసవాలు విజయవంతంగా నిర్వహించబడినట్లు సమాచారం. ప్రసవాలే కాకుండా కంటి, ఎముకలు, గర్భాశయ శస్త్రచికిత్సలు వంటి అనేక వైద్య సేవలను సిబ్బంది తమ ఆసుపత్రుల్లోనే పొందుతున్నారు. ఇది ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలపై ఉన్న విశ్వాసానికి స్పష్టమైన నిదర్శనం. డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఆసుపత్రుల్లో వసతులు, ప్రమాణాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. 24 గంటల వైద్య సేవలు, ఉచిత పరీక్షలు, టీఫా స్కానింగ్, ఏసీ వార్డులు, పరిశుభ్రమైన వాతావరణం, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉండటంతో స్థానికంగానే చికిత్స పొందేలా ప్రజల్లోనూ, సిబ్బందిలోనూ నమ్మకం పెరుగుతోందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కుటుంబ సభ్యులకు సౌకర్యంగా ఉండటంతో ఉద్యోగులు కూడా తమ ప్రభుత్వ ఆసుపత్రులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో అవకాశాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రులను ఎంచుకోవడం భద్రాద్రి జిల్లాలో ఆరోగ్య సేవల నాణ్యతను ప్రతిబింబిస్తోంది.




# రామయ్య ఆతిథ్యానికి...

# “గ్యాస్” కష్టాలు

- సీతారాముల కళ్యాణానికి లక్షలాది మంది భక్తుల రాక
- భోజన వసతి ఏర్పాటు చేసేందుకు హోటల్ యజమానుల ఇక్కట్లు
- సమస్యను గుర్తించి పరిష్కరించాలి
- ప్రభుత్వానికి, కలెక్టర్ కు విన్నవించుకుంటున్న హోటల్ యజమానులు భక్తులు

**ఇరాన్-అమెరికా యుద్ధ ప్రభావం దక్షిణ అయోధ్యగా పేరుందిన భద్రాచలంలో ప్రత్యక్షంగా రామయ్య ఇస్తున్న ఆతిథ్యంతో పాటు లక్షలాది మంది పరోక్షంగా ఆధారపడుతున్న హోటల్ రంగంపై పడుతున్నట్లే కనిపిస్తుంది. కమర్షియల్ గ్యాస్ కొరత ఆతిధ్యరంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. చాలా హోటళ్లు ఇప్పటికే ఆహార పదార్థాల మెనూను కుదించగా మరికొన్ని ఏకంగా మూతపడే స్థితికి చేరుకున్నాయి.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

ఇటువంటి పరిస్థితులలో భద్రాచలంలో ఈనెల 27న శ్రీరామనవమి, శ్రీ సీతారాముల కళ్యాణం, 28న పట్టాభిషేక మహోత్సవాల సందర్భంగా తరలిరానున్న లక్షలాదిమంది భక్తులకు గ్యాస్ కొరత వలన ఆహార సమస్య తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా భక్తులు సీతారాముల పెళ్లి కోసం హోటళ్లను ముందుగానే బుక్ చేసుకున్నప్పటికీ గ్యాస్ సిలిండర్ల కొరత వలన వంట కార్యక్రమాలు నిలిచిపోవడంతో భక్తుల్లో ఆందోళన నెలకొంది వసతికి ఇబ్బంది లేకున్నా ఆహారం దొరుకుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేసేందుకు హోటల్ యజమానుల ఇక్కట్లు...

ప్రస్తుతం హోటళ్లు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరత, మూసివేత భయాల వల్ల, తాము ఎంత ప్రయత్నించినా భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవని పలువురు హోటల్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా కట్టెల పొయ్యిలపై వంటలు చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, అయినప్పటికీ భారీ స్థాయిలో రానున్న భక్తులకు భోజనం అందించేందుకు ఇవి సరిపోవని, హోటల్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కొరత వలన "హోటళ్లు మూతపడితే భక్తులకు ఆహారం అందించడం ఒక్కటే కాదని ఆ రామయ్య కళ్యాణాన్ని కనులారా వీక్షించాలన్న లక్షలాదిమంది భక్తులు నిరాశ పడక తప్పదంటున్నారు.

### ››› కలెక్టర్ సారు.... సమస్యను పరిష్కరించండి...

జగత్కాళ్యాణ కారకుడు రామయ్య పెళ్లి వేడుకలను వీక్షించేందుకు భక్తి భావంతో భక్తులు భద్రాచలం చేరుకుంటున్నారని, ఇటువంటి సమయంలో కడుపు నింపాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని వారికి భోజనం సైతం అందుబాటులో ఉంచలేకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి గ్యాస్ సరఫరా సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, హోటల్ యజమానులతో పాటు భక్తులు, విజ్ఞప్తి చేస్తున్నారు. తక్షణ చర్యగా అదనపు గ్యాస్ సిలిండర్లు కేటాయించడం తాత్కాలికంగా గ్యాస్ డిపోలను ఏర్పాటు చేసి సరఫరాను ఈ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.



## ఉత్సవాల ఏర్పాట్లలో వేగం పెంచాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

(మొదటి పేజీ తరువాయి... )

ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లలో వేగం పెంచాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రవాణా వంటి మౌలిక సదుపాయాలు ఎటువంటి లోపాలు లేకుండా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన భూమి పూజ, శిలాఫలకం ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పనులలో ఆలస్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న గ్యాలరీలు, వేదికలు, భక్తులకు కూర్చునే సదుపాయాలు, ప్రవేశ–నిష్క్రమణ మార్గాల ను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని పార్కింగ్, వైద్య సదుపాయాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఉత్సవాల సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు.అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించగలమని, ప్రతి అధికారి బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు . ఈ పరిశీలనలో శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, దేవస్థానం ఈవో దామోదర్ రావు, తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈవో,వివిధ శాఖల అధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.






# తగ్గేదేలే.. బడా వ్యాపారాలు కొనసాగించుడే!

- చిరు వ్యాపారులపై కోరడా!
- బడా వ్యాపారుల వైపు కన్నెత్తి చూడని వైనం!
- ప్రజాజ్యోతి దినపత్రిక కథనంతో చిరు వ్యాపారులకే నోటీసులు!
- కొత్త బస్టాండ్ వద్ద చిరు వ్యాపారులపై ప్రతాపమా
- డ్రైనేజీలపై షాపులు తొలగించాలని ఆదేశాలు!
- కొన్ని షాపుల సామాగ్రి తరలించి మరల ఇచ్చేసిన సిబ్బంది
- ఆమ్ బజార్ లో డ్రైనేజీలపై వ్యాపారాలు కనిపించడం లేదా?
- రోడ్లను ఆక్రమిస్తున్న కంటి తుడుపు చర్యలేనా!
- ఆమ్ బజార్ పై ప్రధానంగా దృష్టి పెట్టరా!
- మెయిన్ రోడ్డుపై చిరు వ్యాపారులపై వివక్షత ఎందుకో!
- అందరికి ఒకే నిబంధనలు ఉండవా
- అధికారులు ఎలా స్పందించేనో.!

**ఇల్లందు మున్సిపాలిటీ అధికారుల నోటీసులు, ప్రభుత్వ నిబంధనలను భేఖాతర్ చేస్తూ ఆమ్ బజార్ లో డైనేజీలు, మెయిన్ రోడ్డులో ఫుట్ పాత్ లను ఆక్రమించుకొని దర్జాగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ అధికారులు సదరు వ్యాపారులందరికి నోటీసులు జారీ చేసినప్పటికీ వాటిని పెడుతున్న పెడుతూ తగ్గేదేలే అంటూ షాపులను అక్కడే ఉంచి వ్యాపారాలు కొనసాగించడం వారి వ్యవహార శైలికి నిదర్శనమనే చెప్పొచ్చు. ఇల్లందు మున్సిపాలిటీలో మాత్రం ఒక విచిత్ర నిబంధనలు అమలవుతున్నాయని తెలుస్తుంది. ప్రజాజ్యోతి దినపత్రికలో ఆక్రమిస్తాం.. అడ్డుకునేదేవరు.. అనే కథనం ప్రచురితం కావడం జరిగింది. ఈ కథనానికి స్పందించిన అధికారులు అటు అమ్ బజార్, ఇటు మెయిన్ రోడ్డుపై వ్యాపారాలను సమానంగా చూడడం లేదనే ఆపవాదు ఉంది.**

● ఇల్లందు, ప్రజాజ్యోతి

కొత్త బస్టాండ్ వద్ద నుంచి ఉన్న రోడ్లపై చిరు వ్యాపారుల మీద మున్సిపల్ అధికారులు కొరడా జులిపిస్తున్నట్లు స్పష్టమవుతుంది. ఆ ప్రాంతంలో ఉన్న చిరు వ్యాపారులకు ముందస్తు నోటీసులు ఏమి ఇవ్వకుండానే డ్రైనేజీలపై దుకాణాలను ఏర్పాటు చేయవద్దని సూచనలు చేయకుండానే వారికి హుకుం చేస్తూ ఏకంగా కొన్ని షాపుల వద్ద గల సామాగ్రిని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. రెండు రోజుల అనంతరం మున్సిపల్ అధికారుల సూచనల మేరకు ఆయా చిరు వ్యాపారులకు సంబంధించిన సామాగ్రిని ఇచ్చినట్లు సమాచారం. కానీ మున్సిపల్ అధికారులకు ఆమ్ బజార్ కనిపించడం లేదా.. అక్కడ నిత్యం జరిగే రూ. లక్షల్లో వ్యాపారం తెలియదా అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇల్లందు ఆమ్ బజార్ లోనే భారీగా వ్యాపారాలు కొనసాగడం, వివిధ రకాల వ్యాపార సముదాయాలు ఉండడం వల్ల ప్రజలు అధిక సంఖ్యలో సంచరించడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు వస్తుండడంతో డ్రైనేజీని దాటి రోడ్లపైకి దుకాణాలు రావడం ప్రజలు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా మెయిన్ రోడ్డు, ఆమ్ బజార్ లో కొందరు ఏకంగా డ్రైనేజీలపైనే నిర్మాణాలు చేసినట్లు కండ్లకు కనిపిస్తుంది. ఇంతలా జరుగుతున్నప్పటికి సంబంధిత శాఖ అధికారులకు కనిపించడం లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా సదరు శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆయా వ్యాపారుల వద్దకు వెళ్లి షాపులకు సంబందించిన పన్నులు వసూలు చేసే సమయంలోనైనా ఆమ్ బజార్, మెయిన్ రోడ్డులో డ్రైనేజీ, రోడ్డులపైనే వ్యాపారాలు చేయడం, అక్రమంగా వాటిపై నిర్మాణాలు చేసిన కానీ ఆ విషయాన్ని మున్సిపల్ సిబ్బంది కనీసం అధికారుల దృష్టికి తీసుకెళ్లలేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. పైగా ఈ రోడ్లపై వ్యాపారాలు, నిర్మాణాలు చేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. అంటే రోడ్లను ఆక్రమించుకొని దొరక వ్యాపారాలు చేస్తుంటే ఆ శాఖ అధికారులు కేవలం కంటి తురుపు చర్యలతోనే సరిపెట్టుకుంటున్నారా అని విమర్శలు వస్తున్నాయి. మెయిన్ రోడ్డు కన్న ఇల్లందు ప్రధాన వ్యాపార కేంద్రంగా ఉన్న ఆమ్ బజార్ లో డ్రైనేజీ లపై తమను అడిగేవారేవ్వరు లేరనే ధోరణిలో వ్యాపారాలు చేస్తుంటే వాటిపై దృష్టి సారించడం పూర్తిగా విఫలం చెందారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈనెల 18న మున్సిపల్ అధికారుల సూచనల మేరకు సిబ్బంది కేవలం కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కొన్ని షాపులకు మాత్రమే డ్రైనేజీలపై చిరు వ్యాపారులు వ్యాపారాలు చేయవద్దని హుకుం జారీ చేయడంతో పాటు కొందరు సామాగ్రిని మున్సిపల్ కార్యాలయానికి తరలించి, రెండు రోజుల తరువాత వాటిని ఆ చిరు వ్యాపారులకు ఇచ్చినట్టు సమాచారం.

### ››› నోటీసులతో సరిపెడతారా..?

మున్సిపాలిటీలోని మెయిన్ రోడ్డుపై వ్యాపారాలు, ఆమ్ బజార్ లోని డ్రైనేజీలపైనే వ్యాపారాలు చేయడం, కొందరు ఏకంగా ఆమ్ బజార్, మెయిన్ రోడ్డు డ్రైనేజీలపై నిర్మాణాలు చేసిన కానీ అధికారులు మాత్రం కేవలం నోటీసులతోనే సరిపెడతారనే ఆరోపణలు లేకపోలేదు. గతంలో సైతం పలు అనుమతి లేని నిర్మాణాల విషయంలో కూడా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. పేద వాడు ఇల్లు కట్టుకుంటుంటే అనుమతుల పేరుతో నిర్మాణాలను నిలిపివేస్తున్న ఆ శాఖ అధికారులకు మున్సిపాలిటీకి చెందిన డ్రైనేజీలపై వ్యాపారాలు చేయడంతో పాటు నిర్మాణాలు చేస్తుంటే వారికి కనిపించడం లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మెయిన్ రోడ్డుపై వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులే మున్సిపల్ శాఖ అధికారులకు కనిపిస్తున్నారా, ఆమ్ బజార్ కేంద్రంగా భారీ స్థాయిలో వ్యాపారాలు చేసే వారిపై ఎందుకంత ప్రేమ అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చిరు వ్యాపారులకు సహకరించాల్సిన వారే బడ వ్యాపారులకు వత్తాసు పలకటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. బడా వ్యాపార కు ఒక న్యాయం.. చిరు వ్యాపారులకు ఒక న్యాయం ఉంటుందని సూటిగా అడుగుతున్నారు.

### ››› చిరు వ్యాపారులు.. బడా వ్యాపారుల మధ్య తారతమ్యమెందుకో?

ఇల్లందు మున్సిపల్ పరిధిలోని మెయిన్ రోడ్డు, ఆమ్ బజార్ లో వ్యాపారాలు కొనసాగించే చిరు వ్యాపారులు, బడా వ్యాపారుల మధ్య అధికారులు, సిబ్బంది తారతమ్యంగా ఎందుకు చూస్తున్నారని ప్రశ్నలు వస్తున్నాయి. ప్రతి ఒక్క వ్యాపారం నిర్వహించేవారు తప్పనిసరిగా ఆయా మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలకు పన్నులు చెల్లించడం సహజమే. ఎవరి వ్యాపార స్థాయి, ఆర్థిక వనరులను బట్టి వ్యాపారాలు చేస్తుంటారు. అంతేకాని అందరిని ఒకేలా చూడకుండా చిరు వ్యాపారులపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ, బడా వ్యాపారుల పట్ల చూసి చూడనట్లుగా ఉండటం సరికాదని చిరు వ్యాపారులు అంటున్నారు. నోటీసులు మాత్రం ముందుగా చిరు వ్యాపారులకే ఇవ్వడం, ఆమ్ బజార్ బడా వ్యాపారులకు నేటికీ ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం వారి పనితనానికి నిదర్శనంగా ఉందని చిరు వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు స్పందించి బడా వ్యాపారులు, చిరు వ్యాపారులను ఒకేలా చూడాలని, మెయిన్ రోడ్డుపై వ్యాపారాలు చేసే చిరు వ్యాపారులు, ఆమ్ బజార్ కేంద్రంగా వ్యాపారాలు కొనసాగిస్తున్న బడా వ్యాపారులకు ఒకే నిబంధన ఉండేలా చూడాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు. ముఖ్యంగా మెయిన్ రోడ్డుపై మాదిరిగానే ఆమ్ బజార్ బడా వ్యాపారాలు నిర్వహించడం పాటు డ్రైనేజీలపై నిర్మాణాలు చేపట్టిన వారిని గుర్తించి శాఖ పరమైన చర్యలు తీసుకొని, భవిష్యత్తులో మరల ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



## వీకేఓసీలో సింగరేణి కార్మికులతోనే బొగ్గు తీయించాలి

- జి ఎం కార్యాలయం ఎదుట గుర్తింపు సంఘం నిరాహారదీక్ష





**కొత్తగూడెం సింగరేణి, మార్చి 24 – ప్రజాజ్యోతి:** వీ కే ఓ సీ నందు సింగరేణి యంత్రాలతో, సింగరేణి కార్మికులతో మాత్రమే బొగ్గును తీయాలనీ వీ కేసి హెచ్ పి క్రషర్ను సింగరేణి కార్మికులతో మాత్రమే నడిపించాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులూ డిమాండ్ చేసారు. మంగళవారం గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో కార్మిక సమస్యల పరిష్కారం కొరకు జీఎం కార్యాలయం ఎదుట నిరహార దీక్ష చేపట్టారు. బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా కార్యకర్తలకు పూల దండలు వేసి దీక్ష శిబిరాన్ని ప్రారంభించి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్మిక హక్కులు కాపుడుకోవటం కోసం కార్మికవర్గ పోరాటాలు తప్పనిసరి అని భారత కమ్యునిస్టు పార్టీ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అనేక పోరాటాలు చేసి ఎన్ని హక్కులు సాధించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు మరియు కొత్తగూడెం శాసనసభ్యులు అయిన కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో సింగరేణి కార్మికుల సొంత ఇంటి పథకం, మెడికల్ బోర్డు నిర్వహణ, మారుపేర్ల సమస్య,ప్రైవేటీకరణ తదితర అంశాలపై నిరంతరం ప్రశ్నిస్తూ హక్కులను కాపాడటం కోసం పోరాడుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కొత్తగూడెం పీ వీ కే 5 ఇంక్లైన్ నుండి వెళ్ళి సత్తుపల్లి లో దీర్ఘకాలంగా డిప్యూటేషన్ పై పని చేస్తున్న జనరల్ అసిస్టెంట్లను, సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్లుగా కన్వర్షన్ చేసి కొత్తగూడెం ఏరియాలో పోస్టింగ్ ఇవ్వాలనీ జి కే ఓసీ నుండి సత్తుపల్లి వెళ్ళిన సింగరేణి ఉద్యోగులందరిని తిరిగి వీ కే సీ ఎం కు తీసుకు రావాలనీ.కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలనీ కోరుతూ కార్మికులు చేస్తున్న న్యాయమైన డిమాండ్ లు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ నిరహార దీక్ష చేస్తున్న కార్మికులను ఆయన అభినందించారు. యాజమాన్యం మొండి వైఖరి విడనాడి సమస్యలు పరిష్కారం చేయకుంటే కార్మిక వర్గ పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన యాజమాన్యాన్ని హెచ్చరించారు. నిరహార దీక్ష అనంతరం కార్మికులు బారి సంఖ్యలో జి ఎం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన మెమొరాండాన్ని కొత్తగూడెం ఏరియా జి ఎం షాలెం రాజు కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, సహాయ కార్యదర్శి గట్టయ్య, రాము, వైస్ ప్రెసిడెంట్ కత్తెర్ల రాములు, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, ఎస్ నాగేశ్వరరావు, గుమ్మడి వీరయ్య, హీరాలలాల్, బండారి మల్లయ్య, రాజేశ్వర రావు, కర్రు రమే ష్,పిట్ కార్యదర్శిలు భూక్యా రమేష్, మధుకృష్ణ, కమల్,ఎం ఆర్ కే ప్రసాద్,నాయకులు అప్పారావు, మెంగెన్ రవి,కోటి, కుమారరావు, అది రాజేందర్,తిరుపతి,రచందర్,బండి వెంకటరమణ,గంగారం, గావిని నాగరాజు,వినయ్,అవినాష్, ,శేషి సిపిఐ పార్టీ నాయకులు కంచర్ల జములయ్య, భూక్యా శ్రీనివాస్, ఎస్ కే ఫయ్యుం, భూపేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మహిళ మృతి



**చర్ల, మార్చి 24:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని ఆర్ కొత్తగూడెం గ్రామంలోని మిరపచేనులో మిర్చి కోత కోస్తున్న వ్యవసాయ కూలి మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. దేవరపల్లి రాళ్లగూడెంకు చెందిన చిలకాని కనకం (59) ఆర్ కొత్తగూడెం గ్రామంకు చెందిన ఒక రైతు చేలో మిరప పండ్లు కోసేందుకు వెల్లింది. మిరప పండ్లు కోస్తుండగా అస్వస్థతకు గురయిన కనకం వాంతి చేసుకొని క్రిందపడిపోయింది. తోటి కూలీలు ఆమెను హుటాహుటిన సత్యనారాయణపురం ప్రాదమిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ నగేష్ అప్పటికే ఆమె గుండెపోటుతో మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పనులు చేస్తూ కనకం ప్రాణాలను కోల్పోవడం కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

## మండల కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా కలెక్టర్

- ఎర్రగుంట పీహెచ్‌సీ, కేజీవీబీ హాస్టల్‌లలో విస్తృత పరిశీలన
- వైద్య సేవలపై సమగ్ర సమీక్ష.. రోగులతో ముఖాముఖి
- హాస్టల్ సౌకర్యాల తనిఖీ.. విద్యార్థులతో కలెక్టర్ సంభాషణ





**అన్నపురెడ్డిపల్లి, మార్చి 24,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందస్తు సమాచారం లేకుండానే ఈ తనిఖీలు చేపట్టడం గమనార్హం. మొదటగా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, ల్యాబ్, డ్రగ్ స్టోర్ వంటి అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఓపీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యులు సమయానికి అందుబాటులో ఉన్నారా అని ఆరా తీశారు. మందులు ఉచితంగా అందుతున్నాయా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో పరిశుభ్రత, సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ను తనిఖీ చేసి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. రక్తపరీక్షలు మరియు ఇతర పరీక్షల వివరాలను ల్యాబ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెయిన్ డ్రగ్ స్టోర్‌ను తనిఖీ చేసి మందుల నిల్వలను పరిశీలించారు. అవసరమైన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు.రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సిబ్బంది తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రిలో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని అన్నారు. ప్రజలకు నమ్మకంగా సేవలు అందించడం ముఖ్యమని పేర్కొన్నారు. మొత్తం మీద పీహెచ్‌సీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కేజీవీబీ పాఠశాల మరియు కళాశాల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ డైనింగ్ హాల్‌ను సందర్శించి భోజన ఏర్పాట్లను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, కూరగాయల నిల్వలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న రోజు వారీ మెనూను పరిశీలించారు. ఆహారం నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. నీటి సౌకర్యాలు సరిగా ఉన్నాయా అని పరిశీలించారు. హాస్టల్‌లోని సాధారణ సౌకర్యాలపై ఆరా తీశారు.పదవ తరగతి విద్యార్థులు చదువుతున్న తరగతిని సందర్శించి వారితో కొంతసేపు ట్లాడారు. విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకుని చదువు పురోగతిపై ప్రశ్నించారు. మంచి వాతావరణంలో విద్య అందించాలన్నారు. హాస్టల్ నిర్వహణపై ప్రత్యేక అధికారిని ప్రశ్నించారు. హాస్టల్ ప్రత్యేక అధికారి శారదను రోజువారీ నిర్వహణ విధానం గురించి అడిగి వివరాలు తెలుసుకున్నారు. పిల్లలకు అందించే ఆహారం నాణ్యతపై ఆరా తీశారు. పలు సూచనలు చేస్తూ నిర్వహణను మెరుగుపరచాలని సూచించారు.పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హాస్టల్ నిర్వహణ బాగుందని ప్రశంసించారు. అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. ఆకస్మిక తనిఖీల ద్వారా సేవల నాణ్యతను పెంచడం లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, ఎంపీడీవో మహాలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వాణి, హెల్త్ ఎడ్యుకేటర్ జయలక్ష్మి, పబ్లిక్ హెల్త్ నర్స్ ఎస్తేర్ రాణి, హెల్త్ సూపర్వైజర్ ప్రకాశ్ రావు, నర్సింగ్ ఆఫీసర్ సత్యవతి, ల్యాబ్ టెక్నీషియన్ రామారావు, ఎంఈఓ ఉండేటి ఆనంద్ కుమార్, స్థానిక ఎస్సై విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గట్ల చిన్న కోటిరెడ్డి జ్ఞాపకార్థంగా చలివేంద్రం



**పినపాక,మార్చి 24(ప్రజాజ్యోతి ):** పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం గ్రామ పంచాయతీ పరిధిలోని సినిమా హాల్ సెంటర్‌లో గట్ల చిన్న కోటిరెడ్డి గారి జ్ఞాపకార్థంగా చలివేంద్రం (చలివాన్ ) ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఆయన కుమారుడు గట్ల బాలకోటిరెడ్డి, గట్ల బాలిరెడ్డి కలిసి గత పది సంవత్సరాలుగా ప్రతి వేసవిలో నిర్వహిస్తూ సేవా భావాన్ని చాటుతున్నారు.ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి సంవత్సరం మూడు నెలల పాటు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, గ్రామస్తులకు మరియు ప్రయాణికులకు తాగునీరు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో స్థానికులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, గట్ల కుటుంబం చేస్తున్న సేవను ప్రశంసిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఏడుళ్ల బయ్యారం గ్రామ పెద్దలు, గ్రామస్తులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొని గట్ల చిన్న కోటిరెడ్డి గారిని స్మరించుకున్నారు.

## ఆపదొచ్చింది... ఆదుకున్నారు

- అగ్ని ప్రమాద బాధితులకు అండగా నిలిచిన బిఆర్ఎస్





**అశ్వారావుపేట, మార్చి 24, ప్రజాజ్యోతి :** మండలంలోని కొత్త నారం వారి గూడెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయే నిరాశరాయులైన కిన్నెర శ్రీను, కిన్నెర అర్జున్ కుటుంబాలకు బిఆర్ఎస్ నాయకులు బియ్యం, నిత్యవసర సరుకులు, వంట సామాగ్రి, దుస్తులు అందించి అండగా నిలిచారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను కలిసి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీ రామమూర్తి కాసాని చంద్రమోహన్, జూపల్లి రమణారావు, భూక్య ప్రసాదరావు, మోటూరి మోహన్, నారం వారి గూడెం సర్పంచ్ మనుగొండ నాగమణి, మాజీ సర్పంచ్ వెంకట నాగముత్యం, వేదాంతపురం మాజీ సర్పంచ్ సోమిని శివశంకర ప్రసాద్, నారం పోతిరాజు, గోపిన బుచ్చిబాబు, సీతారామ్ సింగ్ పాల్గొన్నారు.

# మూడు రోడ్ల సర్కిల్లో చేతబడి కలకలం

మంత్రాలకు చింతకాయలు రాలవని తెలిసిన ఈ రోజుల్లో కూడా అమాయక ప్రజలు మూఢనమ్మకాల బారిన పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి జరిగినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో చేతబడి లాంటి వింత పూజలపై భయాలు ఇంకా కొనసాగుతున్నాయి. అమాయక ప్రజల్లో అవగాహన లోపాన్ని ఆసరాగా చేసుకుని కొందరు స్వార్థపరులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పరిసరాల ప్రాంతాల్లో చేతబడిల కలకలం మరింతగా పెరుగుతోంది.

- అమావాస్య రాత్రుల్లో రోడ్లపైకి రావడానికే భయపడుతున్న ప్రజలు
- చేతబడి భయంతో గ్రామాల్లో ఆందోళన వాతావరణం
- మూఢనమ్మకాలపై అవగాహన సదస్సులు ఎక్కడ?





**కొత్తగూడెం, మార్చి 24 (ప్రజాజ్యోతి):** మూడు రోడ్లు కలిసే సర్కిళ్లలో ఎర్ర దారాలతో చుట్టిన కొబ్బరికాయలు, కోడి రక్తంతో చేసిన వింత పూజల ఆనవాళ్లు కనిపించడం స్థానికంగా కలకలం రేపుతోంది. కొత్తగూడెం నుంచి నవభారత్ వెళ్లే ప్రధాన రహదారిలో ఈ ఘటనలు చోటుచేసుకోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పాత కొత్తగూడెం, పెనుబల్లి, నవభారత్ మార్గాలు కలిసే కేంద్రంతో పాటు చాతకొండ, కొత్తగూడెం, సాటివారి గూడెం గ్రామాలకు వెళ్లే మూడు రోడ్ల సర్కిళ్లలో ఈ ఘటనలు తరచుగా కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రత్యేకంగా మంగళవారం, ఆదివారం అర్ధరాత్రి సమయంలో అలాగే అమావాస్య రోజున ఈ తరహా పూజలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నిచోట్ల కోడి రక్తంతో కూడిన కొబ్బరికాయలు, నల్ల కోడి పిల్లలను వదిలిన ఆనవాళ్లు కనిపించడం ప్రజల్లో మరింత భయాన్ని కలిగిస్తోంది. రోడ్డు మీద వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. చిన్నపిల్లలతో బయటకు రావడానికే తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. అమావాస్య రోజుల్లో అయితే ఈ మార్గాన్ని పూర్తిగా బహిష్కరించే పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడి నుంచో వచ్చి మూడు రోడ్లు కలిసిన ప్రాంతాల్లో చేతబడి పేరుతో ఇలాంటి పనులు చేసి వెళ్తున్నారని, తమ గ్రామాలకు ఏదైనా అపాయం కలుగుతుందేమోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొత్తగూడెం ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇప్పటికే మూఢనమ్మకాల ప్రభావం ఎక్కువగా ఉందని, కొంతమంది పూజర్లు చేతబడి పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మూఢనమ్మకాలపై ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు, సామాజిక సంస్థలు ముందుకు వచ్చి అవగాహన సదస్సులు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**అమావాస్య రాత్రుల్లో మూడు రోడ్ల పరిధిలో వింత పూజల భయం**

అమావాస్య రాత్రులు వస్తేనే గ్రామాల్లో భయం కమ్ముకుంటోంది. అర్ధరాత్రి వేళల్లో మూడు రోడ్ల సర్కిళ్ల వద్ద వింత పూజల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఎర్ర దారాలతో కొబ్బరికాయలు, రక్తపు గుర్తులు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. రోడ్లపైకి రావడానికే ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. చిన్న పిల్లలతో బయటకు రావడానికి భయపడుతున్నారు. తెలియని వ్యక్తులు వచ్చి ఈ పూజలు చేస్తున్నారన్న అనుమానం భయాన్ని మరింత పెంచుతోంది. ఈ ఘటనలపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**మూఢనమ్మకాలపై అవగాహన సదస్సులు ఎక్కడ..?**

గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాల ప్రభావం రోజురోజుకు పెరుగుతున్నా వాటిపై అవగాహన కల్పించే కార్యక్రమాలు కనిపించడం లేదు. చేతబడి, వింత పూజల పేరుతో అమాయక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రత్యేకంగా అమావాస్య, అర్ధరాత్రి వేళల్లో జరిగే ఘటనలు ప్రజల్లో మరింత అనిశ్చితి పెంచుతున్నాయి. ఈ పరిస్థితిని కొంతమంది స్వార్థపరులు తమ లాభాల కోసం ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు, సామాజిక సంస్థలు ముందుకు వచ్చి అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. మూఢనమ్మకాల బారిన పడకుండా ప్రజలకు ధైర్యం, నమ్మకం కల్పించే చర్యలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## అవగాహనతోనే నివారించగలం

- సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం




**కొత్తగూడెం సింగరేణి, మార్చి 24 – ప్రజాజ్యోతి:** సింగరేణి కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రి లో మంగళవారం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.కిరణ్ రాజకుమార్ ఆదేశాల మేరకు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భముగా చెస్ట్ ఫిజిషియన్ డాక్టర్ రత్నాకర్, హెల్త్ డాక్టర్ డి. లలిత మాట్లాడుతూ... టీబీ వల్ల లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్న సమయంలో 1882వ సంవత్సరం మార్చి 24న, డాక్టర్ రాబర్ట్ కోచ్ క్షయవ్యాధికి కారణమయ్యే 'మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్' అనే బ్యాక్టీరియాను కనుగొన్నారు. టీబీ వ్యాధి నిర్ధారణకు మరియు సరైన చికిత్సకు ఈ ఆవిష్కరణ చాలా ముఖ్యమైనది, దానికి గుర్తుగా ప్రతి ఏడాది మార్చి 24 న నాడు అంతర్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. "అవును! మనం టీబీని అంతం చేయగలం!" అనే నినాధం తో ఈ ఏడాది అంతర్జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం నిర్వహించుకుంటున్నాం అని తెలిపారు. క్షయవ్యాధి (టీబీ) గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి మరియు ఈ ప్రాణాంతక వ్యాధిని అంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఈ రోజున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. రెండు వారాలకు మించి ఆగకుండా దగ్గు రావడం, బరువు తగ్గడం, సాయంత్రం వేళ జ్వరం రావడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటివి టీబీ ప్రధాన లక్షణాలు. వీటిని సాధారణ జలుబు లేదా దగ్గుగా పొరబడి అశ్రద్ధ చేస్తే వ్యాధి తీవ్రమవుతుంది అని, టీబీ పూర్తిగా మందులతో నయం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో చెస్ట్ ఫిజిషియన్ డాక్టర్ రత్నాకర్, హెల్త్ డాక్టర్ డి. లలిత, మెయిన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు మేలు చేసే బడ్జెట్ : డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న







**కొత్తగూడెం, మార్చి 24 (ప్రజాజ్యోతి)** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మూడవ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆశలను నెరవేర్చేదిగా ఉందని డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆమె మాట్లాడుతూ ఇంద్రమ్మ రాజ్యం లక్ష్యంగా రూపొందించిన ఈ బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా ఉందని పేర్కొన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పేరిట రూ.5 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని ఇది రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పిస్తుందని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని అమలు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించడం రైతాంగానికి మేలు చేసే చర్యగా అభివర్ణించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, యువత, మహిళలు, పరిశ్రమలు, విద్యుత్, గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ రూపొందించిన ఈ బడ్జెట్ ప్రజారంజకమైందని చెప్పారు. ఈ సమావేశంలో పిసిసి జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, మాజీ జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, రాష్ట్ర నాయకులు కొత్వాల్ శీను, చీకటి కార్తీక్, నూకల రంగా రావు, డిప్యూటీ మేయర్ సిరిపురం లలిత, మండల అధ్యక్షులు చింతలపూడి శేఖర్, కొండ వెంకన్న, పౌలు, ఆంతోటి, గౌస్, జై సమిధన సభ్యులు అర్జున్ రావు, పరమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన






**ఇల్లందు టౌన్, మార్చి 24, ప్రజాజ్యోతి:** మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచారి (ఇకె) ఆధ్యాత్మిక సేవా సంస్థ ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో ఇల్లందు ప్రముఖ వ్యాపారస్తులు గౌరిశెట్టి శ్రీనివాస్ గుప్తా, సుదర్శన్ గుప్తా, గౌరిశెట్టి కృష్ణ గుప్తా (మాయ), 18వ వార్డు కౌన్సిలర్ పాబోలు స్వాతి కిరణ్ నిర్వహణలో భాగంగా మంగళవారం స్థానిక రాందేవ్ బాబా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంతో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి వచ్చిన దాదాపు 100 మందికి ప్రముఖ హోమియో వైద్యులు డికొండ రాములు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసి పలు సూచనలు చేశారు. దీర్ఘకాలిక సమస్యలకు హోమియోపతి ద్వారా మంచి పరిష్కారాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ క్యాంపులో స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా ట్రైబల్ రెజ్లింగ్‌కు వెంకటప్రసాద్ ఎంపిక






**కొత్తగూడెం, మార్చి 24 (ప్రజాజ్యోతి)** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 3 వరకు జరిగే ఖేలో ఇండియా ట్రైబల్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఏ. వెంకటప్రసాద్ రాష్ట్ర జట్టు తరఫున ఎంపికయ్యారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఫేజ్–2 ఖేలో ఇండియా ట్రైబల్స్ రెజ్లింగ్ జట్ల ఎంపిక పోటీలలో పలు అంతర్జాతీయ క్రీడాకారులతో పోటీ పడుతూ ప్రతిభ కనబరిచి నాలుగో స్థానంలో నిలిచి ఈ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ పి. కాశీ హుస్సేన్ వద్ద శిక్షణ పొందుతున్న వెంకటప్రసాద్ గతంలో కూడా ఆల్ ఇండియా యూనివర్సిటీ, ఫెడరేషన్ కప్, సీనియర్ నేషనల్ స్థాయి పోటీలలో సత్తా చాటుతూ పలు బహుమతులు, పతకాలు సాధించారు. ఇటీవల ఉత్తమ క్రీడాకారుడిగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఖేలో ఇండియా ట్రైబల్ రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన వెంకటప్రసాద్‌ను జిల్లా క్రీడా అధికారి ఎం. పరంధామ రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి. నరేష్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నాగ సీతారాములు, ప్రధాన కార్యదర్శి పి. కాశీ హుస్సేన్, ఉపాధ్యక్షుడు ఐ. ఆదినారాయణతో పాటు పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

## పేకాటపై దాడి – ముగ్గురు అరెస్ట్, నగదు, బైకులు స్వాధీనం

**దమ్మపేట, మార్చి 24(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని పెద్ద గొల్లగూడెం గ్రామ శివారులో గల స్మశాన వాటిక సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు మంగళవారం ఉదయం దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12,400/– నగదు ,మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఘటన స్థలం నుంచి మరో ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు పోలీసులు తెలిపారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు దమ్మపేట ఎస్.ఐ సాయి కిశోర్ రెడ్డి తెలియజేశారు.

## వార్డు కౌన్సిలర్ కు ఘన సన్మానం





**ఇల్లందు, మార్చి 24, ప్రజాజ్యోతి:** మున్సిపల్ ఎన్నికల్లో ఏడవ వార్డు కౌన్సిలర్ గా విజయం సాధించిన గోపగాని రాజు గౌడ్ ను మంగళవారం స్థానిక శ్రీకృష్ణ భజన మందిరం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు ప్రజలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, వార్డులో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కౌన్సిలర్ గోపగాని రాజు గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆవుల శ్రీనివాస్, సలేంద్ర కొమరమ్మ, రాజూరి మంజుల, మారగాని శ్రీనివాస్, ఆవుల మహేష్,వెంకట నిరంజన్,సలేంద్ర వెంకన్న, ఆవుల రవి, కంటే రాజు, రంజిత్ పటేల్, భద్రం, నందు, జైన్ లక్ష్మీబాయి, ఆవుల అరుణ, జడల విజయ, చెన్నుపాటి రాధిక, దివ్వెల లక్ష్మి, పత్తిపాక లక్ష్మి, జడల కృష్ణవేణి పాల్గొన్నారు.

## అమరవీరులకు ఘన నివాళి ___ సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



**దమ్మపేట, మార్చి 24(ప్రజాజ్యోతి):** దమ్మపేట పట్టణంలో సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అమరవీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల జ్ఞాపకార్థం కొవ్వొత్తుల ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరంలో తమ ప్రాణాలను అర్పించిన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ పార్టీ నాయకులు, కార్మికులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, అతి పిన్న వయస్సులోనే భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ధైర్యసాహసాల ప్రతీకలు అని అన్నారు. వారి త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. నేటి యువత దేశభక్తి, సామాజిక న్యాయం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొప్పుల శ్రీనివాసరావు, కొలికిపోగు శ్రీనివాసరావు, భోగ్యం నరసింహారావు, అనిల్ కుమార్, కొలికిపోగు ప్రశాంత్ కుమార్, మోటేపల్లి ధర్మయ్య, భోగి సత్యం, జీసీసీ హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రామాలయాన్ని దర్శించుకున్న రామానుజ జీయర్‌స్వామి



**భద్రాచలం కల్చరల్, మార్చి 24, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని త్రిదండి అహోబిల రామాను జీయర్‌స్వామి వారు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ వైదిక సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన అంతరాలయంలో స్వామి వారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే లక్ష్మీతాయారు ఆలయం, ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అలాగే జీయర్‌స్వామికి వైదిక బృందం వేద ఆశీర్వచనం అందజేశారు

## జీయర్ మఠంలో గరుధ ధ్వజపట ఆవిష్కరణ

- పాల్గొన్న రామాను జీయర్‌స్వామి
- నేడు రామాలయంలో ధ్వజారోహణం





**భద్రాచలం కల్చరల్, మార్చి 24, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జీయర్ మఠంలో గరుడ ధ్వజ పట లేఖనం, ఆవిష్కరన, గరుడ ధ్వజాధివాసం నిర్వహించారు. ఈ కార్యక్రమం త్రిదండి రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్ వైదిక బృందం నిర్వహించారు. కాగా నేడు రామాలయంలో ధ్వజారో హణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముందుగా అగ్ని ప్రతిష్ట నిర్వహించి ధ్వజారోహణం అనంతరం సంతానార్థుల కోసం గరుధ ప్రసాదాన్ని వైదిక సిబ్బంది అందజేయనున్నారు. అలాగే బేరీ తాడనం, దేవతాహ్వానం, బలి సమః ర్పణం నిర్వహించనున్నారు. ఈ కార్యక్ర మంలో భద్రాచలం దేవస్థానం ఏఈవో శ్రావణ్ కుమార్, ఆలయ పర్యవేక్షలు లింగాల సాయిబాబా పాల్గొన్నారు..

## లక్ష్య సాధన కోసం కృషి

**ఇల్లందు, మార్చి 24, ప్రజాజ్యోతి:** ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని గ్రేడ్ 3 కార్యదర్శి ఈ నరేష్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఇల్లందు పట్టణంతోపాటు రొంపేడులో లైసెన్స్ ఉన్న





వ్యాపారస్తుల వద్దకు వెళ్లి నెలసరి నివేదికలతో పాటు మార్కెట్ ఫీజులను వసూలు చేశారు. ఇల్లందు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం లైసెన్సు ఉన్న ప్రతి ఒక్క వ్యాపారి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్ శ్రీనివాస్, సిబ్బంది రంజిత్, మధు పాల్గొన్నారు.

## ఇంటెక్ గ్రూప్ ఆధ్వర్యంలో ఎస్.ఎస్. జయరాజుకు ఘన సన్మానం

- సీతారాముల కళ్యాణానికి పట్టు వస్త్రాల తయారీకి ప్రత్యేక గుర్తింపు



**భద్రాచలం కల్చరల్, మార్చి 24, ప్రజా జ్యోతి:** ప్రతి సంవత్సరం భద్రాచలంలో వైభవంగా నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి చేనేత పట్టు వస్త్రలను అందజేస్తున్న సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ మాజీ చైర్మన్ ఎస్.ఎస్. జయరాజును మంగళవారం ఇంటెక్ గ్రూప్ తరపున బ్రాంచ్ మేనేజర్ సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సురేంద్రకుమార్ మాట్లాడుతూ చేనేత కళాకారులు తమ భక్తి, నైపుణ్యాలను ప్రతిబింబిస్తూ పట్టు వస్త్రాలను సమర్పించడం ఒక పవిత్ర సంప్రదాయంగా కొనసాగుతోందన్నారు. ఎస్.ఎస్. జయరాజు ప్రతి సంవత్సరం భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటెక్ గ్రూప్ తరపున ఇంజనీర్ అభినయ్ దేగల పాల్గొన్నారు.

## 300 కిలోల గోటి తలంబ్రాలను అందజేసిన గజ్వేల్ రామకోటి సంస్థ



**భద్రాచలం కల్చరల్, మార్చి 24 , ప్రజా జ్యోతి:** భద్రాచల సీతారాముల కళ్యానానికి సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థ మూడు క్వింటాల్ల గోటి తలంబ్రాలను మంగళవారం నాడు భద్రాచల దేవస్థానం ఈవో దామోదర్ రావు అందజేశారు. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు దంపతులు గత సంవత్సరం 250కిలోల కోటి తలంబ్రాలు అందించగా ఈ సంవత్సరం 300కిలోల గోటి తలంబ్రాలను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది భక్తులు రామనామ స్మరణ చేస్తూ గోటితో ఒడ్లు ఓలిచి అందించారన్నారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు దంపతులు చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు అమోఘం అని కొనియాడారు. ప్రతి భక్తునిచే రామకోటి వ్రాయించడం హర్షించదగ్గ విషయమని ఈవో పేర్కొన్నారు. మేము వెళ్ళలేకున్న మా తలంబ్రాలు భద్రాచలం వెళ్లడం ఎన్నో జన్మల పుణ్యమో అని, ఇంతటి భాగ్యాన్ని మాకు ప్రతి సంవత్సరం కలగజేయాలని రామకోటి రామరాజుకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్థిక ఇబ్బందుల మధ్య మెడికల్ విద్యార్థినికి తోడుగా మహిళా సమితి

- ఎంబీబీఎస్ చదువుతున్న సింధుకు ల్యాప్టాప్ అందజేత
- ఐటిడిఏ పీవో ప్రశంసలు



**భద్రాచలం, మార్చి 24, ప్రజా జ్యోతి:** ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ చదువుపై ఉన్న మక్కువతో కష్టపడి ఎంబీబీఎస్ చదువుతున్న ఉయ్కే సింధుకు మహిళా సమితి ఆధ్వర్యంలో ల్యాప్టాప్ అందజేయడం అభినందనీయమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.మంగళవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సమితి సభ్యులు, పీవో బి. రాహుల్ చేతుల మీదుగా సింధు తల్లిదండ్రులు వెంకటలక్షి, బాబు లకు ల్యాప్టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సింధు చదువుపై చూపుతున్న ఆసక్తి ఎంతో గొప్పదని అన్నారు. ఆమె ప్రతిభను గమనించిన మహిళా సమితి సభ్యులు ముందుకు వచ్చి ల్యాప్టాప్ అందించడం ప్రశంసనీయం అని తెలిపారు.ప్రస్తుతం మెడికల్ విద్యలో డిజిటల్ సదుపాయాలు అత్యంత కీలకమని, ఈ ల్యాప్టాప్ ద్వారా సింధుకు ఆన్‌లైన్ తరగతులు, చదువు సంబంధిత సమాచారాన్ని సులభంగా పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. భద్రాచలం మహిళా సమితి చేపడుతున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత మంది పేద విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.పేద విద్యార్థులకు విద్యలో సహాయం చేయడం సమాజ అభివృద్ధికి దోహదం చేస్తుందని, సింధు భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సహాయం ఆమె జీవితంలో ఒక ముఖ్యమైన మలుపుగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, బీఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ జి, కార్యదర్శి మాధవి మురలీకృష్ణ, సుభాషిణి, చంగల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీకి పైసలు వచ్చేనా?

- రూ. 40 వేలపైకి పెరిగిన షాపుల వేలం
- అధికారులు నిబంధనలు పాటిస్తారా
- సక్రమంగా పైసలను వసూలు చేసేనా?
- వేలం పాట పైసలు చెల్లించపోతే రెండవ వ్యక్తికి షాపులు కేటాయిస్తారా!
- సుభాష్ నగర్ పంచాయతీలో 2 షాపులకు వేలం పాట నిర్వహణ
- అంత మొత్తంలో చెల్లించడం సాధ్యమేనా?





**ఇల్లందు, మార్చి 24, ప్రజాజ్యోతి:** సాధారణంగా ఆయా గ్రామ పంచాయతీలలో వివిధ వ్యాపారాలకు సంబంధించి కొన్ని రూమ్ లను ఏర్పాటు చేశారు. ఆ షాపులను వేలంపాట నిర్వహించి ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగిస్తారు. ఇల్లందు మండలంలోని సుభాష్ నగర్ గ్రామ పంచాయతీలో మెయిన్ రోడ్డు వెంబడి 2 షాపులను ఏర్పాటు చేయడం జరిగింది. ఆ 2 షాపులకు ప్రతి ఏడాది ఎస్టి లకు మాత్రమే వేలంపాట ద్వారా అవకాశం కల్పించడం జరుగుతుంది. ఈ గ్రామ పంచాయతీ గతంలో ఎన్నడూ లేని విదంగా రికార్డు స్థాయిలో ఒకే వ్యక్తి 2 షాపులను వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలుస్తుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ మొదటి షాపుకు పంచాయతీ మద్దతు ధర రూ. 37,200 లకు గానూ రూ. 50,300, రెండవ షాపుకు పంచాయతీ మద్దతు ధర రూ. 37,200 లకు గానూ రూ. 51 వేలకు వేలంపాటలో దక్కించుకోవడం జరిగింది. అదేవిదంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ మొదటి షాపుకు పంచాయతీ మద్దతు ధర రూ. 39 వేలకు గానూ రూ. 49 వేలకు, రెండవ షాపుకు పంచాయతీ మద్దతు ధర రూ. 39,600 లకు గానూ రూ. 49,400 లకు వేలం పాటలో షాపులను దక్కించుకోవడం జరిగింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ మొదటి షాపుకు పంచాయతీ మద్దతు ధర రూ. 36 వేలకు గానూ రూ. 80 వేలు, రెండవ షాపుకు పంచాయతీ మద్దతు ధర రూ. 36 వేలకు గానూ రూ. 90 వేలకు వేలంపాటలో ద్వారా తీసుకోవడం జరిగింది. ఇంత వరకు బాగానే ఉన్న గతంలో కన్న మొదటి షాపును రూ. 31 వేలు, రెండవ షాపు రూ. 40, 600 లకు అధికంగా వేలంపాటలో షాపులను ఒకే వ్యక్తి దక్కించుకోవడం గమనార్హం. మరి ముఖ్యంగా ఈ రెండు షాపుల వేలం పాట వెనుక ఎవరో ఒక వ్యక్తి ఉండి వేలం పాట పెరిగేలా చక్రం తిప్పినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. వేలంపాటలో 2 షాపులను దక్కించుకున్న వ్యక్తి ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు ప్రతి షాపు వేలంపాటలో 50 శాతం డబ్బులను పంచాయతీకి చెల్లించవలసి ఉంటుంది. ఒకవేళ ఆ వ్యక్తి ఈనెల 26వ తేది సాయంత్రం లోపు 50 శాతం డబ్బులను పంచాయతీకి చెల్లించని పక్షంలో ఈ వేలం పాటలో 2వ స్థానంలో ఉన్న వారికి కేటాయిస్తారు. 2వ స్థానంలో ఉన్న వ్యక్తి కూడా సమయానికి 50 శాతం కట్టకపోతే 3వ స్థానంలో ఉన్న వారికి కేటాయించి వారు కూడా సమయానికి పంచాయతీకి 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. అలా వారు పంచాయతీ నిర్ణయించిన సమయానికి 50 శాతం డబ్బులు చెల్లించని పక్షంలో మరొకరికి కేటాయిస్తారు. అసలు పంచాయతీకి చెందిన 2 షాపులకు సంబంధించి అధికారులు సక్రమంగా వసూలు చేస్తారా అనేది తెలియాల్సి ఉంది. గతంలో కన్నా అధిక ధరకు వేలంపాటలు షాపులను ఒకే వ్యక్తి దక్కించుకోవడంతో సమయానికి పంచాయతీకి డబ్బులు చెల్లించడం సాధ్యమవుతుందా, ఆ దిశగా అధికారులు ముందుకు సాగుతారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రెండు షాపులను దక్కించుకున్న ఒకే వ్యక్తికి అంత మొత్తంలో పంచాయతీకి పైసలు చెల్లించడం సాధ్యమవుతుందా అనుమానాలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అధికారులు చొరవ చూపి నిబంధనల ప్రకారం షాపులను వేలంపాటలో దక్కించుకున్న వారి వద్ద నుంచి సక్రమంగా డబ్బులను వసూలు చేసి పంచాయతీ అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

**నిబంధనల మేరకే వేలంపాట: సందీప్, పంచాయతీ కార్యదర్శి, సుభాష్ నగర్**

నిబంధనలో మేరకే రెండు షాపులకు వేలంపాట నిర్వహించడం జరిగింది. నిబంధనల ప్రకారం వేలంపాటలో షాపులను దక్కించుకున్న వారు సమయానికి పైసలు చెల్లించకపోతే నోటీసులు జారీ చేస్తాం. రెండవ స్థానంలో వేలంపాటలో ఉన్నవారికి ఆ షాపులను కేటాయిస్తాం. వేలంపాట నిర్వహించిన సమయానికి 72 గంటల్లోపు పంచాయతీకి 50 శాతం పైసలు చెల్లించాలి.

# ముత్తారపు కట్ట పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**ఇల్లందు, మార్చి 24, ప్రజాజ్యోతి:** మండలంలోని ముత్తారపు కట్ట ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న 8 మంది విద్యార్థులు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటారని మంగళవారం పాఠశాల ఉపాధ్యాయుడు కబ్బాకుల రవి తెలిపారు. గత నెల 19న జరిగిన గురుకుల ప్రవేశ పరీక్షలు రాయగా ఈనెల 24న వెలువడిన గురుకుల పరీక్ష ఫలితాలలో 8 మంది విద్యార్థులు ఐదవ తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారన్నారు. నలుగురు విద్యార్థులు టిజిటిడబ్ల్యూఆర్ఎస్ సుదిమళ్ళ, ఇద్దరు టిజిటిడబ్ల్యూఆర్ఎస్ దమ్మపేట, ఒకరు యంజేపిటిబిసిడబ్ల్యూఆర్ఎస్ కొత్తగూడెం, ఒకరు యంజేపిటిబిసిడబ్ల్యూఆర్ఎస్ సత్తుపల్లి గురుకులాల్లో సీట్లు సాధించినట్లు తెలిపారు. గురుకులాల్లో సీట్లు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు అభినందించారు.



# అనాథలకు అండగా మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్

- కారుణ్య ఆశ్రమంలో నిత్యావసర వస్తువులు పంపిణీ
- అనాథ పిల్లలను ఆదుకోవడంలో దాతలు ముందుండాలి
- ట్రస్ట్ చైర్మన్ కొప్పల మురళి



**భద్రాచలం టౌన్, మార్చి 24, ప్రజాజ్యోతి:** భద్రాచలం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని 'కారుణ్య అనాథ ఆశ్రమం' లోని పిల్లలకు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. మంగళవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.5 వేల రూపాయలు విలువైన నిత్యావసర వస్తువులను ఆశ్రమ పిల్లలకు ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి చేతుల మీదుగా వస్తువులను అందజేశారు.ఈ సందర్భంగా చైర్మెన్ కొప్పుల మురళి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి, వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ బాధ్యతగా పెంచుతున్న ఆశ్రమ నిర్వాహకులు సునీల్ కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తద్వారా ఆశ్రమానికి, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమాజంలోని దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, అనాథ పిల్లల అవసరాల కోసం తమ వంతు ఆర్థిక సాయం అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలని మురళి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బందా సాయి కుమార్, ఆపక హరికృష్ణ, ఎడ్విన్ కిషోర్, జిలకర నాగరాజు మరియు విద్యార్థుల సంరక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

- ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్ష , ఏప్రిల్ 7 వరకు దరఖాస్తులకు గడువు



**భద్రాచలం టౌన్, మార్చి 24, ప్రజా జ్యోతి:** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల పరిధిలోని ప్రతిభా కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు భద్రాచలం గిరిజన గురుకుల ప్రతిభా కళాశాల (బాలికల) ప్రిన్సిపాల్ శ్రీమతి ఏ. పద్మావతి తెలిపారు.ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన గురుకుల విద్యాసంస్థల పరిధిలోని ప్రతిభా కళాశాలల్లో ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 19న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అభ్యర్థులు మార్చి 12 నుంచి ఏప్రిల్ 7 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు చెందిన గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.అర్హతలు, ఎంపిక విధానం, పరీక్షా కేంద్రాలు తదితర వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

# రాజ్యసభ సభ్యుడిని కలిసిన ఎమ్మెల్యే

**ఇల్లందు, మార్చి 24, ప్రజాజ్యోతి:** నూతనంగా రాజ్యసభ సభ్యునిగా ఏన్నికైన రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ని మంగళవారం హైదరాబాదులో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం రాజ్యసభ సభ్యుడిగా పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.



# దమ్మపేటలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ – లోపాలు, అక్రమాలు వెలుగులోకి

**దమ్మపేట, మార్చి 24 (ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ పగడాల రమాదేవి ఆధ్వర్యంలో 01 ఏప్రిల్ 2024నుండి 31 మార్చి 2025వరకు ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ద్వారా ఉపాధి కూలీల వేతనాలు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల బిల్లులు,లబ్ధిదారులకు అందని చెల్లింపులపై గ్రామస్తులకు అవగాహన కల్పించడం లక్ష్యంగా నిర్వహించారు. ఈ సమావేశానికి హక్కుదారులలో ఒకరైన కునుసోతు నాగమణిని అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు.



### ››› ఆడిట్ నివేదిక వివరాలు

సమావేశంలో ఏపీవో ,బ్లాక్ రిసోర్స్ పర్సన్ ఎస్. రాజు ఆడిట్ నివేదికను ప్రజలకు వివరించారు. ఏపీవో మాట్లాడుతూ 2005లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడం, పనుల నాణ్యతను పర్యవేక్షించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పనులు సక్రమంగా జరిగాయా, కూలీలకు నష్టం కలిగిందా అనే అంశాలపై తనిఖీలు నిర్వహించామని చెప్పారు. బి.ఆర్.పి ఎస్. రాజు మాట్లాడుతూ ఈ పథకం వలస నివారణ, భూగర్భ జలాల అభివృద్ధి, సుస్థిర ఆస్తుల సృష్టి కోసం అమలు చేస్తున్నారని వివరించారు.

### ››› ఆర్థిక వివరాలు & పనులు

కూలీల వేతనాలపై రూ.21,16,120, సామగ్రిపై రూ.1,52,643 ఖర్చు చేసి మొత్తం రూ.22,68,753 వినియోగించారు. పంచాయతీరాజ్ విభాగంలో మూడు పనులకు రూ.17,57,900 ఖర్చు చేసినట్లు తెలిపారు. మొత్తం రూ.1.64 కోట్ల లేబర్ బడ్జెట్‌లో కేవలం రూ.22 లక్షలు మాత్రమే ఖర్చు చేయగా రూ.1,41,41,237 మిగులు నిలిచింది. మొత్తం 24 పనులు చేపట్టగా మట్టి రోడ్డు, ఛానల్స్, చెరువుల పూడిక, ఇంకుడు గుంతలు, నర్సరీ, ప్లాంటేషన్, కొబ్బరి డ్రాగన్ ఫ్రూట్ సాగు పనులు ఉన్నాయి.

### ››› ఆడిట్‌లో బయటపడిన లోపాలు

తనిఖీల్లో అనేక లోపాలు గుర్తించబడ్డాయి. ఇంకుడు గుంతల పనుల్లో ఇద్దరు లబ్ధిదారులకు చెల్లింపులు ఆలస్యమైనట్లు వెల్లడించారు. పని డిమాండ్ రికార్డులు నిర్వహించకపోవడం, జాబ్ కార్డుల అప్డేట్ పూర్తి కాకపోవడం, వేతన రసీదుల పంపిణీ లోపించడం, రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేకపోవడం వంటి అంశాలు బయటపడ్డాయి. అలాగే నెలవారీ సమావేశాలు నిర్వహించకపోవడం, పనిస్థలాల్లో తాగునీరు, టెంట్, ఫస్ట్ ఎయిడ్ సౌకర్యాలు లేకపోవడం, విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేయకపోవడం వంటి లోపాలు గుర్తించారు.

### ››› ప్లాంటేషన్ & నర్సరీలో నిర్లక్ష్యం

ప్లాంటేషన్– నర్సరీ పనుల్లో తక్కువ ఫలితాలు నమోదయ్యాయి. నల్లకుంటలో నాటిన మొక్కలలో చాలా తక్కువ మాత్రమే జీవించగా, కొబ్బరి మొక్కలలో కూడా భారీ నష్టం జరిగింది. నర్సరీలో వేల సంఖ్యలో మొక్కలు ఉన్నట్లు రికార్డులు చూపించినప్పటికీ వాస్తవంగా తక్కువ సంఖ్యలో మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన రికార్డులు తనిఖీకి అందుబాటులో లేకపోవడం కూడా వెల్లడైంది.

### ››› ఆర్థిక అక్రమాలు గుర్తింపు

పనిదినాల కంటే ఎక్కువ రోజులకు వేతనాలు చెల్లించడం, ప్లాంటేషన్ ఖర్చులను అధికంగా చూపించడం వంటి ఆర్థిక లోపాలు కూడా బయటపడ్డాయి. కొంతమంది లబ్ధిదారులకు అదనపు చెల్లింపులు జరిగినట్లు ఆడిట్‌లో వెల్లడైంది.ఈ వివరాలను గ్రామస్తులకు తెలియజేయగా పంచాయతీ కార్యదర్శి బండి అనంత కుమార్ అన్ని అంశాలను నమోదు చేసి, పూర్తి సమాచారం అందించని ఫీల్డ్ అసిస్టెంట్‌పై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇలాంటి సమావేశాల సమాచారం ముందుగానే గ్రామస్తులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, పూణేం పోలమ్మ, గ్రామస్తులు, ఉపాధి హామీ హక్కుదారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో యువత ముందుకు రావాలి

- వైపిఎల్ ఆధ్వర్యంలో 95వ వర్ధంతి సభ నిర్వహణ



**పాల్వంచ, మార్చి 24, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణంలోని వికలాంగుల కాలనీలో ప్రగతిశీల యువజన సంఘం (వైపిఎల్) ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, కాగడాలతో నివాళులు అర్పించారు. సభలో వైపిఎల్ జిల్లా కార్యదర్శి కోర్సా రామకృష్ణ, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు కల్లూరి కిషోర్ మాట్లాడారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సాధించి 95 సంవత్సరాలు గడిచినా దేశంలో సామాన్య ప్రజలకు సంపూర్ణ స్వేచ్ఛ, సమానత్వం అందలేదని అభిప్రాయపడ్డారు. భగత్ సింగ్ వంటి పోరాట చైతన్యం కలిగిన యువతరం దేశానికి అవసరమని, ప్రస్తుత పరిస్థితుల్లో యువత సమాజ సమస్యలపై స్పందిస్తూ ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్యలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపద కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే పరిస్థితులపై యువత ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో యుద్ధ వాతావరణం నెలకొంటున్నదని, దేశం స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరించాలని సూచించారు. పెరుగుతున్న చమురు, గ్యాస్ ధరలు, నిరుద్యోగ సమస్యలు ప్రజల జీవనంపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. యువత భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని ఆచరణలో పెట్టి దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా పట్టణ కార్యదర్శి రాయబారపు వెంకటేశ్వర్లు, టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్, వేల్పుల రమేష్, కుంజా భాస్కర్, దుర్గా ప్రసాద్, బాబు, రవి కిరణ్, రాయబారపు దేవ కరుణ పాల్గొన్నారు.

## నేడు దమ్మపేట వారాంతపు సంత వేలం

- పాల్గొనండి, అవకాశాన్ని వినియోగించుకోండి



**దమ్మపేట, మార్చి 24(ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వారాంతపు సంత నిర్వహణ హక్కుల కోసం నేడు వేలం పాట జరగనుంది. బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ వేలం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ వేలానికి రూ.1,15,000/– (ఒక లక్ష పదిహేను వేల రూపాయలు) మద్దతు ధరగా నిర్ణయిస్తూ భద్రాద్రి కొత్తగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. సంత నిర్వహణ హక్కులను పొందదలచిన వ్యాపారులు, ఆసక్తి గల వ్యక్తులకు ఇది మంచి అవకాశం అని అధికారులు తెలిపారు.వేలం కార్యక్రమం గ్రామ సర్పంచ్, మండల పంచాయతీ అధికారుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించబడుతుంది. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ. 5,000/– ధరావత్తు (డిపాజిట్) చెల్లించి నమోదు చేసుకోవాలి. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బండి అనంత కుమార్ మాట్లాడుతూ, ఆసక్తి గలవారు సమయానికి హాజరై వేలంలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధికి తోడ్పడే ఈ ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనాల తయారీకి ఆదేశాలు

- ఉల్వనూరు ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

**పాల్వంచ, మార్చి 24, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిరోజు నిర్దేశిత మెనూ ప్రకారం భోజనాలు సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి జి. శ్రీనివాస్, ఎంపీడీవో బొగ్గ నారాయణ ఆదేశించారు. ఈ సందర్భంగా ఉల్వనూరు ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన అధికారులు, వంటశాలలో వినియోగిస్తున్న బియ్యం, పప్పు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారం నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల వసతి గదుల్లో పూర్తిస్థాయిలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతిరోజు వండే కూరగాయలు, టిఫిన్ వివరాలతో మెనూ చార్ట్‌ను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీలను పరిశీలించి నిర్వహణ విధానంపై సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి , వార్డెన్ వీరన్న, ఏపీవో పోరండ్ల రంగా, కార్యదర్శి పరశురాం, క్షేత్ర సహాయకుడు సారయ్య తదితరులు పాల్గొన్నారు.





## రైతుప్రభుత్వంగా కాంగ్రెస్ పరిపాలన

- రైతు భరోసా నిధుల విడుదలపై కొత్వాల హర్షం

**పాల్వంచ, మార్చి 24, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని రైతు ప్రభుత్వంగా పరిపాలన కొనసాగిస్తున్నదని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. యాసంగి పెట్టుబడుల కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తొలి విడతగా 70 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ.6,000 చొప్పున మొత్తం రూ.3,590 కోట్లు విడుదల చేయడాన్ని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు భరోసా పథకం ద్వారా ప్రతి సంవత్సరం రెండు విడతల్లో (ఖరీఫ్, రబి) ఎకరానికి రూ.6,000 చొప్పున మొత్తం రూ.12,000 పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా కింద కోటిన్నర ఎకరాలకు సుమారు రూ.9,000 కోట్లు పెట్టుబడి సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతగా రూ.3,590 కోట్లు ఇప్పటికే విడుదల కాగా, రెండవ విడతగా రూ.2,650 కోట్లు, మూడవ విడతగా రూ.2,760 కోట్లు ఏప్రిల్ నెలాఖరులోపు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ & గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రైతు పక్షపాత విధానాలతో పాలన సాగిస్తున్నారని తెలిపారు. రైతు భరోసా నిధుల విడుదల పట్ల రాష్ట్రంలోని రైతుల తరపున సంబంధిత నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కొత్వాల శ్రీనివాసరావు వెల్లడించారు.



# కలెక్టరేట్ కార్యాలయం ఎదుట టిపిటిఎఫ్ నిరసన

- రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20% నిధులు కేటాయించాలి




**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 24,ప్రజా జ్యోతి:** రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20% నిధులు కేటాయించాలనే ప్రధాన డిమాండ్ తో పాటు ఉపాధ్యాయుల ఇతర ఆరు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టి పి టి ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు , ఈ సందర్భంగా టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు,జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గుగులోత్ హరిలాల్ నాయక్,జోగా రాంబాబులు మాట్లాడుతూ! ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం అధికార పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా,రాష్ట్ర విద్యా కమిషన్ రిపోర్టు కనుగుణంగా రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20% నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని,పిఆర్సి ఫిట్మెంట్ను వెంటనే ప్రకటించి బడ్జెట్లో నిధులు కేటాయించాలని,రిటైర్డ్ టీచర్ల పెన్షనరీ ప్రయోజనాలను ఏక మొత్తంలో ఒకే సారి విడుదల చేయాలని,సిపిఎస్ ను రద్దు చేయాలని,2003 డిఎస్సి టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని,టీచర్ల పెండింగ్ బిల్లులు,పెండింగ్ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు , అదేవిధంగా విద్యారంగంలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయ వ్యవస్థను రద్దు చేయాలని,వారికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని, కేజీబీవీ,మోడల్ స్కూల్స్,గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని సిఆర్టి లకు,రెసిడెన్షియల్ స్కూల్ టీచర్లకు నగదు రహిత వైద్య సదుపాయాన్ని కల్పించాలని కోరారు ,రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన అరకొర నిధులతో ప్రభుత్వ విద్యారంగాన్ని ఏ విధంగా బలోపేతం చేస్తారని ఆయన ప్రశ్నించారు , కావున తక్షణమే రాష్ట్ర బడ్జెట్లో ప్రభుత్వ విద్యారంగానికి 20% నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో టిపిటిఎఫ్ ఉద్యమాలను తీవ్రతరం చేస్తుందన్నారు,రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్ ఉపాధ్యాయ వ్యవస్థను రద్దు చేసి వారికి మినిమం టైం స్కేల్ ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పించి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు ,సిపిఎస్ అనేది ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఒక మహమ్మారిగా మారినందున సిపిఎస్ ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు , ఈ నిరసన కార్యక్రమానికి పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి, భద్రాద్రి జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శివ ప్రశాంత్,వీరభద్రంలు సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని ఏవో కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి,అకడమిక్ సెల్ కన్వీనర్ ఎం.రామాచారి,రాష్ట్ర కౌన్సిలర్స్ కె.మాధవ రెడ్డి,బి.ప్రసాద్ రావు జిల్లా ఉపాధ్యక్షులు పి.గంగరాజు,వి.సరియా,పి కృష్ణయ్య,జిల్లా కార్యదర్శులు జి.భాగ్య రావు,ఎస్.కృష్ణ బాబు, జిల్లా కౌన్సిలర్స్,మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కురుసం వెంకటేశ్వర్లు,బి.వెంకట్ రామ్,పి.సర్వేశ్వరరావు,బి.రామరాజు,పి.సమ్మయ్య,బి.రవి,సుందర్, రామనాథం,శ్రీనివాస్,చెన్నారావు,పి. సత్యనారాయణ,చింత బుచ్చిరాములు,పూర్ణిమ,కవిత,కన్నమ్మ,టీ.ఇమ్మానియేల్ ,బి.కస్నానాయక్,బి.లింబ్యా, ప్రకాష్ రావు,ముత్తయ్య,శివ,రామకృష్ణ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# 18 మంది మావోయిస్టుల లొంగుబాటు.!





- డీకేఎస్ జెడ్ సి సభ్యుడు పాపారావు లొంగుబాటు.!
- లొంగిపోయే 18 మంది కేడర్లలో 7 గురు మహిళా కేడర్లు

**చర్ల, మార్చ్ 24:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో డీకేఎస్జెడ్సీ సభ్యుడు పాపారావు, డీవీసీఎం ప్రకాష్ మాడ్వి, డీవీసీఎం అనిల్ టాటిలతో పాటు ఏడుగురు మహిళా కార్యకర్తలతో కూడిన 18 మంది మావోయిస్టు కార్యకర్తల బృందం, హింసను వీడి జనజీవన స్రవంతిలో శాంతియుత జీవితాన్ని గడపాలనే తమ కోరికను ప్రభుత్వానికి తెలియజేసింది. పునరావాస ప్రక్రియలో భాగంగా, వారు ఏకే-47 రైఫిళ్లు ఇతర రహస్య ఆయుధాలను అప్పగిస్తున్నారు.2026 మార్చి 24న జరిగిన ఈ ముఖ్యమైన సంఘటన, నక్సల్ రహిత బస్తర్ తీర్మానం ఇప్పుడు వాస్తవరూపం దాల్చిందనడానికి బలమైన నిదర్శనం అని దండకారణ్య ప్రాంతంలోని మావోయిస్టు ఉద్యమ చరిత్రలో తొలిసారిగా, నక్సలైట్ సంస్థ వాస్తవంగా నాయకత్వం లేనిదిగా మారింది అని

ప్రభుత్వ దార్శనికతకు ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్షకు అనుగుణంగా, బస్తర్ ఇప్పుడు నూతన శక్తి, నూతన ఉత్సాహం సానుకూల గుర్తింపుతో మరింత బలంగా ఆవిర్భవించడానికి సిద్ధంగా ఉంది అని అధికారులు అన్నారు .ప్రస్తుతం చిన్న చిన్న గుంపులుగా తిరుగుతున్న మిగిలిన కార్యకర్తలలో కొందరైనా రాబోయే రోజుల్లో శాంతి మార్గాన్ని ఎంచుకుని జనజీవన స్రవంతిలోకి తిరిగి వస్తారని మేము ఆశిస్తున్నాము అని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాంతంలో వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలకడానికి మేము చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో, డీకేఎస్జెడ్సీ సభ్యుడు దక్షిణ ఉప జోనల్ బ్యూరో ఇన్చార్జి పాపారావుతో పాటు మరో 17 మంది కేడర్లు లొంగిపోవడం ఒక నిర్ణయాత్మక ముందడుగు అని డికెఎస్జెడ్సి సభ్యుడు పాపారావు, డివిసిఎం ప్రకాష్ మాడ్వి, డివిసిఎం అనిల్ తట్టిలతో కూడిన 18 మంది మావోయిస్టు కార్యకర్తల బృందం, హింసను విడనాడి జనజీవన స్రవంతిలో శాంతియుత జీవితాన్ని స్వీకరించడానికి తమ సుముఖతను వ్యక్తం చేస్తూ ప్రభుత్వాన్ని సంప్రదించింది అని లొంగిపోయే ప్రక్రియలో భాగంగా, వారు ఏకే-47 రైఫిళ్లు ఇతర శ్రేణి ఆయుధాలను అప్పగించనున్నారు అని లొంగిపోయిన 18 మంది కేడర్లలో 7 మంది మహిళా కేడర్లు ఉన్నారు.2026 మార్చి 24న జరిగిన ఈ కీలక పరిణామం, నక్సల్ రహిత బస్తర్‌ను సృష్టించే లక్ష్యం వాస్తవరూపం దాల్చే దిశగా స్థిరంగా ముందుకు సాగుతోందనడానికి బలమైన నిదర్శనంగా నిలుస్తుంది అని దండకారణ్యంలో మావోయిస్టు ఉద్యమ చరిత్రలో తొలిసారిగా, నక్సల్ సంస్థ వాస్తవంగా నాయకత్వం లేనిదిగా మారింది అని ప్రభుత్వం ఊహించిన విధంగా ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా కోరుకున్నట్లుగా, బస్తర్ ఇప్పుడు నూతన స్ఫూర్తితో, భవిష్యత్తు కోసం ఒక సానుకూల గుర్తింపుతో మరింత బలంగా ఆవిర్భవించడానికి సిద్ధంగా ఉంది అని ప్రస్తుతం చిన్న చిన్న గుంపులుగా తిరుగుతున్న మిగిలిన కొద్దిమంది కార్యకర్తలు కూడా రాబోయే రోజుల్లో శాంతి మార్గాన్ని ఎంచుకుని జనజీవన స్రవంతిలోకి తిరిగి వస్తారని మేము ఆశిస్తున్నాము అని డి.కె.ఎస్.జెడ్.సి సభ్యుడు పాపారావుతో సహా, దక్షిణ ఉప జోనల్ బ్యూరో ప్రాంతానికి చెందిన లొంగిపోయిన మొత్తం 18 మంది కేడర్ల అధికారిక పునరేకీకరణ ప్రక్రియ తదనంతరం నిర్వహించబడుతుంది అని మరిన్ని వివరాలు తగిన సమయంలో తెలియజేయబడతాయి అని అధికారులు అన్నారు .

## క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు రేపు ఎంపికలు



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 24 – ప్రజాజ్యోతి:** హకీంపేట క్రీడా పాఠశాలలో చదువు కోవడానికి విద్యార్థుల ఎంపికలో భాగముగా చుంచుపల్లి మండలం స్థాయి క్రీడా ఎంపికలను రామవరం లోని భారత్ పబ్లిక్ స్కూల్ లో ఈనెల 26న ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు చుంచుపల్లి మండల విద్యాశాఖ అధికారి బి. నీరజ ఒక ప్రకటనలో తెలియజేశారు. పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ చేసుకున్న దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు ఒరిజినల్ , మూడో తరగతి చదువుతున్న పాఠశాల నుండి పొందిన వయస్సు, విద్యార్హత సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, మూడవ తరగతి ప్రోగ్రెస్ / క్రీడా రిపోర్ట్, కమ్యూనిటీ సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, సర్టిఫికెట్స్ తో తప్పనిసరిగా తీసుకురావలసినదిగా కోరారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరగనున్న ఎంపికలకు పంపనున్నట్లు ఆమె తెలిపారు.

## కార్మికులను మోసం చేసిన గుర్తింపు సంఘం




**ఇల్లందు, మార్చి 24, ప్రజాజ్యోతి :** మాకు అధికారాన్ని ఇస్తే సింగరేణి కార్మికులు చెమట చుక్క చిందించకుండా అన్ని సౌకర్యాలు, హక్కులు సాధించి పెడతామని మాయ మాటలతో గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ కార్మికులను మోసం చేసిందని ఐఎన్టీయూసీ ఇల్లందు ఉపాధ్యక్షుడు జే వెంకటేశ్వర్లు ఆరోపించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేసి ప్రతి కార్మికుడికి 250 గజాల ప్లాటు, రూ. 20 లక్షల వడ్డీ లేని రుణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారని గుర్తు చేశారు. అదేవిధంగా ఇన్‌కమ్ టాక్స్ మాఫీ చేయిస్తామని, మెడికల్ బోర్డు యధావిధిగా కొనసాగిస్తూ కారుణ్య నియామకాలు ఉద్యోగాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏఐటీయూసీని గెలిపిస్తే కార్మికుల భవిష్యత్తు బంగారంలా మారుతుందని నమ్మబలికారని విమర్శించారు. వారి మాటలు నమ్మిన కార్మికులు ఏఐటీయూసీ ని గుర్తింపు సంఘంగా గెలిపించాలని తెలిపారు. కానీ గుర్తింపు సంఘం గెలిచిన తర్వాత కార్మికులకు ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచిపోయారని ఆరోపించారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి, చందాలు వసూలు చేసి, ఆ డబ్బుతో బస్సు యాత్రలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. గుర్తింపు సంఘంగా ఉండి కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉండగా, అదే యూనియన్ నిరసన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం ఇలా చేయడం సింగరేణి చరిత్రలోనే మొదటిసారి అని గుర్తు చేశారు. యూనియన్ నాయకులు మేమే సింగరేణిలో గెలిచిన గుర్తింపు సంఘంగా చెప్పుకుంటూ ఉన్నప్పటికీ, కార్మికులు ఎదుర్కొంటున్న అసలు సమస్యలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని, ట్రైపార్టైట్ సమావేశాలలో కార్మికుల సమస్యలను బలంగా ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు గుర్తింపు సంఘ వైఖరి ఎలా ఉందో ఆలోచించుకోవాలని సూచించారు.